ఎస్బీఐ చైర్మన్ దినేశ్‌కుమార్ ఖారాతో (మధ్యలో), బ్యాంక్ ఎండీలు చల్లా శ్రీనివాసులు శెట్టి, అశ్వినీకుమార్

# ఎస్బీఐ లాభం 17 వేల కోట్లు

## రూ.1.22 లక్షల కోట్లకు ఆదాయం

న్యూఢిల్లీ, ఆగస్టు 3: దేశీయ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ) నిరాశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికానిగాను బ్యాంక్ రూ.17,035 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని గడించింది. అంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.16,884 కోట్ల లాభంతో పోలిస్తే కేవలం ఒక్క శాతం లోపు పెరుగుదల నమోదైంది. మొండి బకాయిలను పూడ్చుకోవడానికి అధికంగా నిధుల కేటాయించడం వల్లనే లాభాల్లో గండిపడిందని పేర్కొంది. వరుస త్రైమాసికాలతో పోలిస్తే 17.7 శాతం తగ్గింది. సమీక్షకాలంలో బ్యాంక్ ఆదాయం రూ.1,08,039 కోట్ల నుంచి రూ.1,22,688 కోట్లకు చేరుకున్నట్లు బీఎస్ఈకి సమాచారం అందించింది. దీంట్లో వడ్డీల ద్వారా వచ్చే ఆదాయం రూ.95,975 కోట్ల నుంచి రూ.1,11,526 కోట్లకు పెరిగినట్లు తెలిపింది.

- బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తుల విలువ 2.76 శాతం(రూ.91,327.84 కోట్లు) నుంచి 2.21 శాతానికి(రూ.84,226 కోట్లు) తగ్గాయి.
- నికర ఎన్‌పీఏ కూడా 0.71 శాతం (రూ.21,051.08 కోట్లు) నుంచి 0.57 శాతానికి (రూ.21,554.69 కోట్లు) దిగొచ్చాయి.
- కన్సాలిడేటెడ్ విషయానికి వస్తే రూ.1,52,125 కోట్ల ఆదాయంపై రూ.19,325 కోట్ల నికర లాభాన్ని గడించింది. అంతక్రితం ఏడాది రూ. 1,32,333 కోట్ల ఆదాయంపై రూ. 18,537 కోట్ల లాభాన్ని నమోదు చేసుకున్నది.
- బాసెల్-3 నిబంధనలకు లోబడి టైర్-1, టైర్-2 బాండ్లను జారీ చేయడం ద్వారా గరిష్ఠంగా రూ.25 వేల కోట్ల నిధుల సేకరణకు బ్యాంక్ బోర్డు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.
- ప్రొవిజన్ కవరేజ్ రేషియో(పీసీఆర్) 74.41 శాతంగా నమోదయ్యాయి.
- బ్యాంక్ డిపాజిట్లు 8.18 శాతం ఎగబాకి రూ.49.02 లక్షల కోట్లకు చేరుకున్నాయి. గతేడాది రూ.45.31 లక్షల కోట్లుగా ఉన్నాయి.
- అడ్వాన్స్‌లు ఏడాది ప్రాతిపదికన 15.39 శాతం ఎగబాకి రూ.38.12 లక్షల కోట్లకు చేరాయి.
- దేశీయంగా రిటైల్ పర్సనల్ అడ్వాన్స్‌లు 13.60 శాతం పెరిగి రూ.13.68 లక్షల కోట్లుగా నమోదయ్యాయి.
- నికర వడ్డీ ఆదాయం 5.71 శాతం అధికమై రూ.38,905 కోట్ల నుంచి రూ.41,125 కోట్లకు చేరాయి.

# నిజాం షుగర్‌కు మోక్షమెప్పుడు?

## సర్కార్ కాలక్షేపం • కాంగ్రెస్ హామీ బుట్ట దాఖలు • చుట్టపు చూపునకే మంత్రుల కమిటీ

నిజామాబాద్, ఆగస్టు 3 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): నిజామాబాద్ జిల్లా బోధన్‌లోని నిజాం షుగర్ ఫ్యాక్టరీని ఆరు నెలల్లోనే పునరుద్ధరిస్తామన్న కాంగ్రెస్ పార్టీ హామీ హామీగానే మిగిలిపోయింది. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో పీసీసీ అధ్యక్షుడి హోదాలో నిజాం షుగర్ ఫ్యాక్టరీని పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చిన రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించి ఏడు నెలలైనా అడుగు ముందుకు పడలేదు. పునరుద్ధరణ కోసమంటూ పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు నేతృత్వంలో కమిటీని ఏర్పాటు చేసినప్పటికీ ఇది చుట్టపు చూపునకే పరిమితమైంది. శ్రీధర్‌బాబుతోపాటు ఎమ్మెల్సీ టీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ఈ ఏడాది ఫిబ్రవరి 24న ఫ్యాక్టరీని సందర్శించారు. రైతులు, కార్మికులు, రాజకీయ పక్షాల అభిప్రాయాలు తీసుకున్నారు. చక్కెర పరిశ్రమను ప్రారంభించేందుకు కసరత్తు జరుగుతున్నదని చెప్పి మళ్లీ తిరిగి రాలేదు. చెరకు రైతులకు పర్చేస్ ట్యాక్స్, రాయితీ ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తామన్నారు. ట్రాన్స్‌పోర్టు రాయితీ, కొత్త వంగడాలపై దృష్టి సారిస్తామని చెప్పారు. ఇక ఆ తరువాత అడుగు ముందుకు పడలేదు. ఇటీవల అసెంబ్లీలో ప్రవేశపెట్టిన 2024-25 బడ్జెట్‌లోనూ ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క సైతం నిజాం షుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరణకు కట్టుబడి ఉన్నట్టు చెప్పారు.

### కోర్టు కేసు సంగతేమిటి?

2015లో ప్రస్తుత యాజమాన్యం లేఆఫ్ ప్రకటించింది. దీనిపై చక్కెర ఫ్యాక్టరీ కార్మికులు కోర్టును ఆశ్రయించారు. తమకు రావాల్సిన వేతనాలపై న్యాయపోరాటం చేస్తున్నారు. ఈ తొమ్మిదేండ్లపాటు లేఆఫ్‌లో భాగంగా పని కోల్పోయిన కార్మికుల దుస్థితిని కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకుంటుందా? లేదా?




అన్నది అనుమానమే. రిటైర్మెంట్ వయసు దాటిన కార్మికుల స్థానంలో కొత్తవారి నియామకం చేపట్టాల్సి ఉంటుంది. ఈ విషయంలోనూ ప్రభుత్వం నుంచి ఎలాంటి ఉలుకూ పలుకూ లేదు.

### టీడీపీ వల్లే ఫ్యాక్టరీ కుదేల్

నిజాం షుగర్ ఫ్యాక్టరీని 1938లో ఏడో నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ నేతృత్వంలో నెలకొల్పారు. నిజాం హయాంలో ఆసియాలోనే అతిపెద్ద ఫ్యాక్టరీకి రికార్డులకెక్కింది. శక్కర్‌నగర్‌గా పేరొందిన ఈ ప్రాంతమంతా కార్మికులకు చేతి నిండా పనితో, రైతులకు సమృద్ధిగా చెరకు పంటలతో కళకళలాడింది. నిజాం షుగర్ ఫ్యాక్టరీని నెలకొల్పినప్పుడే యాజమాన్యం 16,395 ఎకరాలు సేకరించింది. రైతులపై ఆధారపడకుండా మిల్లుకు అవసరమైన చెరుకును సొంతంగా సాగు చేయడానికి ఈ నిర్ణయం తీసుకున్నారు. సాగు నీటి కోసం నిజాంసాగర్ జలాశయం సైతం నిర్మించారు. శక్కర్‌నగర్ కేంద్రంగా 20 కిలోమీటర్ల పరిధిలో భూములు విస్తరించగా నిర్వహణకు డివిజన్ల వారీగా 14 ఫారాలు ఏర్పాటు చేశారు. ఆ తరువాత ఉమ్మడి రాష్ట్ర పాలనలో నిజాం షుగర్ ఫ్యాక్టరీ ఆస్తులపై పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది. రూ.కోట్లు విలువ చేసే వ్యవసాయ, వ్యవసాయేతర భూములు ఆక్రమణకు గురయ్యాయి. నష్టాల నెపంతో 1996 జూలైలో ప్లాంటేషన్ విభాగాన్ని శాశ్వతంగా మూసివేశారు. అప్పటినుంచి భూముల అమ్మకం మొదలైంది. ప్రభుత్వరంగ కార్పొరేషన్లు, వేలం పాట ద్వారా కలిపి 14,787 ఎకరాలు రైతులకు విక్రయించారు. మిల్లు కార్మికులు 305 ఎకరాలు కొనుగోలు చేశారు. 2002లో నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకున్న నిర్ణయం బోధన్ చక్కెర కర్మాగారాన్ని నాశనం చేసింది. ఫ్యాక్టరీ నిర్వహణను ప్రైవేటు యాజమాన్యానికి అప్పగించిన తర్వాత మరికొంత భూమిని తెగనమ్మేశారు.

### కార్మికులు, రైతుల్లో ఆందోళన..

*బోధన్ చక్కెర ఫ్యాక్టరీ పునరుద్ధరణ అంశంపై కార్మికులకు, ఈ ప్రాంత రైతులకు అనేక అనుమానాలు కలుగుతున్నాయి. పునరుద్ధరణ అంటే ప్రభుత్వమే ఫ్యాక్టరీని చేతుల్లోకి తీసుకొని నడుపుతుందా? ఇప్పుడున్న యాజమాన్యానికే బాధ్యతలు ఇస్తుందా? యాజమాన్యం మార్పును చేపట్టి కొత్తవారికి కట్టబెట్టి ఫ్యాక్టరీని నడిపిస్తారా? అనే అంశంపై ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టతరావడం లేదు. ఫ్యాక్టరీని ఎప్పటిలోగా పునరుద్ధిస్తారు? ప్రస్తుతం ఫ్యాక్టరీలో ఉన్న యంత్రాలు పనికి వస్తాయా? కొత్త యంత్రాలు తేవాల్సి ఉంటుందా? అన్నది తేల్చాల్సి ఉన్నది. ఫ్యాక్టరీని పునరుద్ధరిస్తే ఉన్నఫళంగా రైతులను చెరకు పంట సాగు వైపు మళ్లించాల్సి ఉంటుంది. అయితే, బోధన్ చుట్టూ 20 నుంచి 30 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో చెరకు సాగు ప్రోత్సాహానికి ప్రభుత్వం నుంచి ఎలాంటి అడుగులు పడకపోవడం గమనార్హం. దీంతో పునరుద్ధరణపై అనుమానాలు కలుగుతున్నాయి. మరోవైపు, బోధన్ షుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరణ అంశం రాజకీయంగానూ ప్రాధాన్యం సంతరించుకుంటున్నది. మద్యం వ్యాపారంలో అనుభవం ఉన్న అధికార పార్టీకి చెందిన ఒక నాయకుడు ఈ ఫ్యాక్టరీని హస్తగతం చేసుకోవాలనే ప్రయత్నంలో భాగంగా ఇదంతా జరుగుతున్నదన్న చర్చ బోధన్‌లో విస్తృతంగా వినిపిస్తున్నది.*

### పోరాడక తప్పదేమో

నిజాం షుగర్స్ పునరుద్ధరణపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉన్నట్టు కనిపించడం లేదు. 2015 డిసెంబర్‌లో ఫ్యాక్టరీ యాజమాన్యం లేఆఫ్ ప్రకటించింది. ఇది అక్రమం. అప్పటినుంచి ఇప్పటివరకు కార్మికులకు వేతనాలు రావాలి. వేతన బకాయిలు, నిజాం షుగర్స్ పునరుద్ధరణపై ప్రభుత్వం స్పష్టమైన వివరణ ఇవ్వాలి.

**- ఈరవేణి సత్యనారాయణ, కార్మికుడు**

### రిపోర్టును బయటపెట్టండి

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిజాం షుగర్స్ పునరుద్ధరణపై మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులతో కమిటీని వేశారు. ఆ కమిటీ ఏం చెప్పింది? ఫ్యాక్టరీ పునరుద్ధరణ ప్రాసెస్ ఏమిటి? నిజాం షుగర్స్‌లోని యూనిట్లను ప్రారంభించేందుకు ఎంత మొత్తం కావాలి? చెరుకు పంట విస్తీర్ణం పెంచేందుకు ఏం చర్యలు తీసుకుంటున్నారు? తదితర విషయాలపై ఎటువంటి వివరణను ప్రభుత్వం ఇవ్వడంలేదు. కమిటీ రిపోర్టును చర్చకు పెడితే క్లారిటీ వస్తుంది.

**- ఎస్ కుమారస్వామి, స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి**

### వేతనాలు లేక అవస్థలు

నిజాంషుగర్స్‌ను పునరుద్ధరిస్తామని రాష్ట్ర బడ్జెట్‌లో ప్రస్తావించడంతో మాకు నమ్మకం కలిగింది. ఈ నిర్ణయాన్ని తప్పకుండా అమలుచేయాలి. త్వరలో తెరిపించి, మాకు ఉపాధి కల్పించి మా జీవితాలను బాగుచేయాలి.

**- తలారి బాలకృష్ణ, కార్మికుడు, నిజాం షుగర్స్, బోధన్**

# ఈసారి 16,000కోట్ల పెట్టుబడులు!

- **మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి**

హైదరాబాద్, ఆగస్టు 3(నమస్తే తెలంగాణ): విదేశీ పెట్టుబడులే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రులు విదేశీ పర్యటనలకు బయలుదేరివెళ్తున్నారు. ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి బయలుదేరి వెళ్లగా..ఆదివారం రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు నేతృత్వంలోని మరో బృందం అమెరికా, దక్షిణ కొరియా పర్యటనకు బయలుదేరి వెళ్తున్నారు. ఈ నెల 4 నుంచి 11 వరకు జరగనున్న ఈ పర్యటనల్లో రూ.16 వేల కోట్లకు సంబంధించి విదేశీ పెట్టుబడుల ఒప్పందాలు జరిగే అవకాశం ఉన్నదని శ్రీధర్ బాబు వెల్లడించారు.

### బెంగళూరును అధిగమిస్తాం..

సాఫ్ట్‌వేర్ ఎగుమతుల్లో రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రస్థానంలో నిలబెట్టేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తున్నదని శ్రీధర్‌బాబు వెల్లడించారు. సెప్టెంబర్‌లో హైదరాబాద్‌లో జరగనున్న కృత్రిమ మేధ గ్లోబల్ సమ్మిట్‌ను పురస్కరించుకొని ఐటీ విభాగం అధికారులు రూపొందించిన ఏఐ సమ్మిట్ వెబ్‌సైట్‌ను సచివాలయంలో ఆయన ప్రారంభించారు. ప్రస్తుతం రూ.7 లక్షల కోట్ల ఐటీ ఎగుమతులతో బెంగళూరు మొదటి స్థానంలో ఉండగా, రూ.2.5 లక్షల కోట్లతో హైదరాబాద్ రెండో స్థానంలో ఉందని వివరించారు.

## హైదరాబాద్‌లో రిలయన్స్ మరో స్టోర్

హైదరాబాద్, ఆగస్టు 3: రిలయన్స్ డిజిటల్.. హైదరాబాద్‌లో మరో స్టోర్‌ను ప్రారంభించింది. హయత్‌నగర్‌లో 8 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ స్టోర్‌ను ప్రముఖ నటి నభానటేష్ శనివారం ఆరంభించారు. ఈ స్టోర్‌లో అన్ని రకాల డిజిటల్ పరికరాలపై 10 శాతం వరకు తగ్గింపు ధరకే విక్రయిస్తున్నట్లు ప్రకటించింది. రిలయన్స్ డిజిటల్ 500కి పైగా అంతర్జాతీయ బ్రాండ్లతోపాటు 2 వేలకు పైగా దేశీయ బ్రాండ్ల ఉత్పత్తులను అందిస్తున్నది.

## ఉద్యోగాల్లేని వృద్ధి వ్యర్థం: రంగరాజన్

హైదరాబాద్, ఆగస్టు 3: ఉద్యోగాలు సృష్టించలేని వృద్ధి వ్యర్థమేనని రిజర్వు బ్యాంక్ మాజీ గవర్నర్ రంగరాజన్ స్పష్టంచేశారు. మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరించబోతున్నదని కేంద్రం ఊదరగొడుతున్న వార్తల నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేయడం విశేషం. ప్రస్తుతం ఉద్యోగ కల్పన విషయం ప్రపంచ దేశాలకు సవాల్‌గా మారిందని, దీనిని గట్టెక్కడానికి తీవ్రంగా కృషి చేయాలని ఇక్రై ఫౌండేషన్ 14వ స్నాతకోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. భారత్ ద్రవ్యోల్బణం, రూపాయి-డాలర్ రేట్ వంటి సమస్యలతో సతమతమవుతున్నదని, అలాగే 6-7 శాతం వరకు వృద్ధిని సాధిస్తే తలసరి ఆదాయం 13 వేల డాలర్ల స్థాయికి చేరుకోవడం సులువవుతున్నదన్నారు. మరోవైపు, రష్యా-ఉక్రెయిన్ దేశాల మధ్య జరుగుతున్న యుద్ధంతో అత్యధిక దేశాలు తమ సొంత సరఫరా వ్యవస్థను మెరుగుపరుచుకోవడంతో పాటు కీలక వస్తువులను దిగుమతి చేసుకునే దానిపై పునరాలోచనలో పడ్డాయన్నారు.

## దివీస్ ఆకర్షణీయం

హైదరాబాద్, ఆగస్టు 3: దివీస్ ల్యాబ్స్ ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. జూన్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను సంస్థ రూ.430 కోట్ల నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.356 కోట్ల కంటే ఇది 21 శాతం అధికం. కంపెనీ ఆదాయం గత త్రైమాసికానికి 19 శాతం ఎగబాకి రూ. 2,118 కోట్లకు చేరుకున్నట్లు తెలిపింది. మరోవైపు, పెట్టెడ్ ఫ్రాగ్‌మెంట్స్ మాలుక్యూల్స్ విభాగంలోకి అడుగుపెట్టే ఆలోచనలో ఉన్నట్లు కంపెనీ వెల్లడించింది.

## ఆ నాజూకు నడకే క్యాట్‌వాక్కు..

తమిళ అగ్రహీరో విజయ్ ద్విపాత్రాభినయం చేస్తున్న మోస్ట్ ఎవైటెడ్ పాన్ ఇండియా మూవీ 'ది గోట్' (ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్‌టైమ్). మీనాక్షి చౌదరి కథానాయిక. కల్పాతి ఎస్.అఘోరం, కల్పాతి ఎస్.గణేశ్, కల్పాతి ఎస్. సురేష్ నిర్మాతలు. తెలుగులో మైత్రీమూవీ మేకర్స్ విడుదల చేస్తున్నారు. సెప్టెంబర్ 5న సినిమా విడుదల కానుంది. ప్రమోషన్‌లో భాగంగా ఈ సినిమాలోని మూడో పాటను మేకర్స్ విడుదల చేశారు. 'జిగి జింతాకు చూపే ఒక స్పార్కు.. ఆ నాజూకు నడకే క్యాట్‌వాక్కు..' అంటూ సాగే ఈ పాటను రామజోగయ్యశాస్త్రి రాయగా, యువన్‌శంకర్‌రాజా స్వరపరిచి, వృష బాలుతో కలిసి ఆలపించారు. ఈ పాటలో విజయ్ డాన్స్ మూమెంట్స్ మెస్మరైజ్ చేస్తాయని, విజయ్, మీనాక్షి చౌదరి కెమిస్ట్రీ ఈ పాటలో ఓ రేంజ్‌లో ఉంటుందని మేకర్స్ చెబుతున్నారు. ప్రశాంత్, ప్రభుదేవా, మోహన్, జయరామ్, స్నేహ, లైలా, అజ్మల్ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సిద్ధార్థ్ నుని.

## వయనాడ్ విషాదానికి పదిలక్షల విరాళం

చిత్రం

బ్లాక్‌బాస్టర్స్‌లో నటిస్తూ పాన్‌ఇండియా హీరోయిన్‌గా అవతరించింది నేషనల్ క్రష్ రష్మిక మందన్నా. సామాజిక సమస్యలపై స్పందించడంతోపాటు.. బాధ్యతగా వ్యవహరించడం రష్మికలోని ప్రత్యేకత. తాజాగా కేరళ వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడటంతో ఏర్పడిన విషాదం పట్ల రష్మిక తీవ్ర విచారం వ్యక్తం చేసింది. 'వందలమంది ప్రాణాలు కోల్పోవడంతో దిగ్భ్రాంతికి గురయ్యాను. ఈ కష్టకాలంలో కేరళ ప్రజలంతా మనోధైర్యంతో మెలగాలి. దేవుడు అందర్నీ ఆదుకుంటాడు' అంటూ ప్రజలకు ధైర్యాన్ని చెప్పింది రష్మిక. అంతేకాకుండా తనవంతు సాయంగా కేరళ సీఎం రిలీఫ్ ఫండ్‌కు 10 లక్షల రూపాయలు విరాళంగా అందజేసింది. దీంతో రష్మిక మంచి మనసుకు అందరూ ఫిదా అయిపోతున్నారు. రష్మికే కాదు, రష్మిక మనసు కూడా అందమైనదేనంటూ కితాబులిస్తున్నారు.

## హాలీవుడ్ స్థాయిలో 'జీ2'

అడివిశేషు నటించిన బ్లాక్‌బాస్టర్ స్పై థ్రిల్లర్ 'గూఢచారి' విడుదలై అరేళ్లు పూర్తయింది. ప్రస్తుతం ఈ సినిమా సీక్వెల్‌లో నటిస్తున్నారు అడివిశేషు. షూటింగ్ కూడా 40శాతం పూర్తయింది. వచ్చే ఏడాది ద్వితీయార్థంలో ఈ సినిమాను విడుదల చేయనున్నట్టు నిర్మాతలు టి.జి.విశ్వప్రసాద్, అభిషేక్ అగర్వాల్, అనిల్ సుంకర ప్రకటించారు. ఓ వైపు మేకర్స్ ప్రమోషన్స్ షురూ చేశారు. అందులో భాగంగా 'గూఢచారి2' (జీ2)కు సంబంధించిన ఆరు స్టైలిష్ యాక్షన్ మూమెంట్స్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఈ సందర్భంగా అడివిశేషు మాట్లాడుతూ ' ఆరేళ్లనుంచీ ఈ సినిమా ప్రశంసలు వింటూనే ఉన్నా. ఇప్పుడు చేస్తున్న సీక్వెల్ దాన్ని మించేలా ఇంటర్నేషనల్ స్కేల్‌లో ఉంటుంది. 'గూఢచారి' అభిమానులకు 'జీ2' ఓ విజువల్ ట్రీట్' అన్నారు. ఈ సినిమాలోని ప్రతి ఎలిమెంట్ గొప్ప సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌ని ఇస్తుందని దర్శకుడు వినయ్‌కుమార్ సిరిగినీడి చెప్పారు. హాలీవుడ్ సినిమాలకు ఏమాత్రం తీసిపోని విధంగా 'గూఢచారి2'(జీ2) ఉంటుందని నిర్మాతలు తెలిపారు. ఇమ్రాన్‌హష్మీ, మురళీశర్మ, సుప్రియ యార్లగడ్డ, మధుశాలిని తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి మాటలు: అబ్బూరి రవి, కెమెరా: అమ్మీజ్ అహ్మద్.

## తండేల్ మ్యూజిక్.. దేవిశ్రీ మ్యాజిక్

నాగచైతన్య, సాయిపల్లవి జంటగా చందూ మొండేటి దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'తండేల్'. అల్లు అరవింద్ సమర్పణలో ప్రతిష్టాత్మక గీతాఆర్ట్స్ పతాకంపై బన్నీవాసు నిర్మిస్తున్న భావోద్వేగ ప్రయాణమే ఈ సినిమా. ఈ సినిమాకు దేవిశ్రీ ప్రసాద్ స్వరాలందిస్తున్న విషయం తెలిసిందే. శనివారం దేవిశ్రీప్రసాద్ పుట్టిన రోజు. ఈ సందర్భంగా 'తండేల్' టీమ్ ఆయనకు శుభాకాంక్షలు అందించింది. నాగచైతన్య, చందూ మొండేటి, బన్నీవాసు కలిసి దేవీశ్రీకి బర్త్‌డే విషెస్ తెలుపుతున్న ఓ ఫొటోని మేకర్స్ విడుదల చేశారు. 'తండేల్'లో దేవిశ్రీ మ్యూజిక్ మ్యాజిక్ చేయబోతున్నదని, త్వరలోనే మ్యూజిక్ ప్రమోషన్స్ మొదలుపెడతామని మేకర్స్ తెలిపారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి కెమెరా: షామ్‌దత్, ఎడిటింగ్: నవీన్ నూలి.

## ప్రాణంపెట్టి పనిచేయడంవల్లే ఈ విజయం

కృష్ణవంశీ, మోక్ష జంటగా రూపొందిన చిత్రం 'అలనాటి రామచంద్రుడు'. చిలుకూరి ఆకాష్‌రెడ్డి దర్శకుడు. హైమావతి, శ్రీరామ్ జడపోలు నిర్మాతలు. శుక్రవారం ఈ సినిమా విడుదలైంది. ఈ సందర్భంగా చిత్రయూనిట్ థ్యాంక్స్‌మీట్ నిర్వహించింది. 'ప్రేక్షకదేవుళ్లని ఎందుకంటారో మా సినిమాకు వస్తున్న స్పందన చూస్తుంటే అర్థమైంది. తొలి సినిమాకు ఇంతమంచి కేరక్టర్ దొరకడం నిజంగా అదృష్టం. ఆ అదృష్టాన్నిచ్చిన దర్శక, నిర్మాతలకు కృతజ్ఞతలు. మోక్ష బెస్ట్ కోస్టార్. అందరూ ప్రాణం పెట్టి పనిచేశారు కాబట్టే ఈ విజయం' అని హీరో కృష్ణవంశీ ఆనందం వెలిబుచ్చారు. దర్శక,నిర్మాతలు పాషన్‌తో తీసిన సినిమా ఇదని, ఇందులో తాను చేసిన ధరణి పాత్ర తన ఒరిజినల్ కేరక్టర్‌కి దగ్గరగా ఉంటుందని కథానాయిక మోక్ష చెప్పారు. సినిమా విజయం పట్ల దర్శక, నిర్మాతలు ఆనందం వెలిబుచ్చారు.

## పిఠాపురంలో 5న ఆయ్ హంగామా

నార్నే నితిన్, నయన్ సారిక జంటగా రూపొందుతోన్న గోదావరి నేపథ్య ప్రేమకథ 'ఆయ్'. అంజి కె.మణిపుత్ర దర్శకుడు. అల్లు అరవింద్ సమర్పణలో బన్నీవాసు, విద్యా కొప్పినీడి నిర్మిస్తున్న ఈ సినిమా ఈ నెల 15న విడుదల కానుంది. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు సినిమాపై అంచనాలు పెంచాయని, పాటల స్పందన కూడా బావుందని, సోషల్‌మీడియాలో ఈ సినిమా రీల్స్, షార్ట్స్ బాగా వైరల్ అవుతున్నాయని మేకర్స్ ఆనందం వెలిబుచ్చారు. ఈ అంచనాలను మరింత పెంచేలా ఈ నెల 5న పిఠాపురంలో ఈ సినిమా ట్రైలర్‌ని విడుదల చేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. దీనికి సంబంధించిన ఓ రొమాంటిక్ పోస్టర్‌ని కూడా విడుదల చేశారు. ఫన్ అండ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమాకి కెమెరా: సమీర్ కల్యాణి, సంగీతం: రామ్ మిర్యాల.

## బడ్డీ ప్రేక్షకులకు బాగా నచ్చేసింది

''బడ్డీ'కి వస్తున్న స్పందన చూస్తుంటే ఆనందంగా ఉంది. ఈ సినిమాలోని కామెడీ, ఎమోషన్స్, యాక్షన్‌తోపాటు టెడ్డీబేర్ క్యారెక్టర్ కూడా ప్రేక్షకులకు బాగా నచ్చేసింది. తమిళ్ 'టెడ్డీ'లోని ఒక లైన్ మాత్రమే తీసుకొని కంప్లీట్‌గా కొత్త కథతో ఈ సినిమా చేశాను. కథ చెప్పగానే సింగిల్ సిట్టింగ్‌లో శిరీష్ ఓకే చేశారు. ఆయనతో సినిమా చేయాలని ఎప్పట్నుంచో అనుకుంటున్నా. అది ఈ సినిమాతో కుదిరింది.' అన్నారు దర్శకుడు శామ్ ఆంటోన్. ఆయన దర్శకత్వంలో అల్లు శిరీష్ హీరోగా రూపొందిన చిత్రం 'బడ్డీ'. కేఈ జ్ఞానవేల్‌రాజా నిర్మించిన ఈ చిత్రం ఇటీవలే విడుదలై, థియేటర్లలో ప్రదర్శింపబడుతున్నది. ఈ సందర్భంగా దర్శకుడు శామ్ ఆంటోన్ విలేకరులతో ముచ్చటించారు. 'ఇది పూర్తిగా థియేటర్ల కోసమే చేసిన సినిమా. ఇందులో టెడ్డీకి ఎక్స్‌ప్రెషన్స్ తీసుకురావడం మాకు పెద్ద టాస్క్‌గా మారింది. ఎందుకంటే ఆ పాత్ర ఎమోషన్ వర్కవుట్ అయితే సినిమా హిట్. అందుకే చాలా శ్రమించాం. క్లైమాక్స్ ఫైట్‌తో పాటు ఇందులో యాక్షన్ సీక్వెన్స్ అన్నింటికీ మంచి అప్లాజ్ వస్తున్నది. ముఖ్యంగా హిప్ హాప్ తమిళ సంగీతం ఈ సినిమాకు పెద్ద ఎస్సెట్.' అని తెలిపారు శామ్ ఆంటోన్.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.